

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

తెలుగు రాష్ట్రాలలో పలు దొంగతనాలు చేసిన నల్గొండ జిల్లా భువనగిరికి చెందిన అంతర్ రాష్ట్ర దొంగ శ్రీనివాస్ (47)ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. -8లో



సొమ్మొకరిది.. సోకొకరిదన్నట్లు..

సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి వ్యవహారం ఉందని మేయర్ విమర్శించారు. పలు డివిజన్లలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.0/27.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం 27.5 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 19.75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్-2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ సూర్యారావు తెలిపారు. ఓపెన్ ఇంటర్ ద్వారా రెండేళ్ల కోర్సును ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఒక వేళ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోతే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

21న ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు: ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ అర్హత కలిగి ఉర్దూ మాధ్యమంలో బోటనీ, ఫిజిక్స్ సబ్జెక్టులలో 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. అర్హులు ఈనెల 19లోపు దరఖాస్తులను కళాశాల ఆఫీసులో అందజేయాలని తెలిపారు. ఈనెల 21న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నేడు దర్గా స్వామి జయంతి

రామాపురం (రాయ చోటి జగదాంబసెంటర్): రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్బార్ సాయినగర్‌లోని సాయి విద్యా మందిర్‌లో ఈ నెల 16న సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ దర్గా స్వామీజీ 95వ జయంతి వేడుకలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జయంతి ఉత్సవాలకు భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు తెలియజేశారు.

వెబ్‌సైట్‌లో పీఎఫ్ వివరాలు

కడప ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్తు యాజమాన్య పరిధిలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది 2023-24వ సంవత్సరానికి సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా పరిషత్తు డిప్యూటి సీఈఓ సుబ్రమణ్యం తెలిపారు. వివరాలకు https://www.zppysrkadapa.com/portal/pf-slips సందర్శించాలని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఒక నెలలోపు రాత పూర్వకంగా కార్యాలయంలో అందజేస్తే పరిష్కరిస్తామని వివరించారు.

చెన్నేపల్లి పాఠశాల సందర్శన



చెన్నేపల్లి పాఠశాల వద్ద కాలనీ వాసులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

అట్లూరు: అట్లూరు మండల పరిధిలోని చెన్నేపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఈఓ పాఠశాలకు వచ్చిన విషయం తెలుసుకున్న చెన్నేపల్లి కాలనీ వాసులు అక్కడకు చేరుకున్నారు. 'అయ్యా మా పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను ఎస్ వెంకటాపురం పాఠశాలకు తరలించాలని ఉపాధ్యాయులు అంటున్నారు. అలా జరిగితే మాపిల్లలను మేం పంపియ్యం.. 5వ తరగతి వరకూ మా కాలనీలోనే చదువు చెప్పాలి' అని విన్నవించారు. స్పందించిన డీఈఓ ఈ విషయం ఇదివరకే తన దృష్టికి వచ్చిందని.. ఈ సమస్య గురించి విద్యాశాఖ జాయింట్ డైరెక్టరుకు పంపించామని.. అక్కడ నుంచి ఉత్తర్వులు అందే వరకూ ఈ పాఠశాలను ఇక్కడే కొనసాగుతుందని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1,2 విలియంరాజు, ఖాదర్‌వల్లి, సీఆర్‌పీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

20న జిల్లాస్థాయి హిందీ వ్యాసరచన పోటీలు


రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని నూనెవారిపల్లెలో ఉన్న బీవీఎన్ పాఠశాలలో ఈనెల 20వ తేదీ ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా స్థాయిలో ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో హిందీ వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ ప్రముఖ హిందీ నవలాకారుడు ప్రేమ్‌చంద్ 146వ జయంతిని పురస్కరించుకొని 'ప్రేమ్‌చంద్‌కి జీవని' అనే అంశంపై పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రేమ్‌చంద్ జయంతి రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 6303701314 నంబర్‌కు ఫోన్ చేసి తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



❐ కడప నగరంలో ఐదు గ్రావెల్ క్వారీలు అధికారికంగా ఉండగా, ఒక్క దానికి కూడా రాయల్టీ ఇవ్వలేదు. చుట్టుపక్కల గుట్టలతో మొదలు పెట్టి చింతకొమ్మదిన్నె చెరువు, కొలుములపల్లె పిచ్చమ్మ గుట్ట, పబ్బాపురం చెరువు, పెండ్లిమర్రి మండలం గొందిపల్లె గుట్టలు, పెద్దదాసరిపల్లె చెరువు ఇలా అక్రమ మైనింగ్ చేస్తూ గ్రావెల్ మట్టి ద్వారా తెలుగుతమ్ముళ్లు కోట్లాది రూపాయలు దోపిడీ చేశారు. నిత్యం వందలాది టిప్పర్లతో కడప నగరానికి తరలించి సొమ్ము చేసుకున్నారు. నిత్యం రూ.5లక్షలు తక్కువ కాకుండా గ్రావెల్ ద్వారా స్వాహా చేశారు.



❐ సంక్రాంతి పండుగ సందడిలో ఎవరికి వారు ఉండిపోగా, అదే అదునుగా పులివెందుల టీడీపీ నేతలు నిల్వ ఉన్న బరైటీస్ ఖనిజాన్ని రాత్రికి రాత్రే లూటీ చేశారు. మండల కేంద్రమైన వేముల పలు గనుల్లో తీసిన బరైటీస్ ఖనిజాన్ని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) నుంచి వేలంలో టిఫిన్ కంపెనీ కొనుగోలు చేసింది. ఆ కంపెనీ ప్రాంగణంలో దాదాపు 3,500 టన్నులు నిల్వలు అధికారికంగా ఉన్నాయి. ఆ స్టాకు పైన తెలుగుతమ్ముళ్ల కన్ను పడింది. అక్రమ మైనింగ్ చేస్తే కొంత మాత్రమే అక్రమ ఆదాయం గడించవచ్చు, రాత్రికి రాత్రే నిల్వ ఉన్న ఖనిజాన్ని కొల్లగొడితే భారీగా లబ్ధి పొందవచ్చనే ఆలోచనలతో తెగబడ్డారు. సుమారు రూ.10 కోట్ల విలువైన ఖనిజాన్ని 20 లారీల ద్వారా తెల్లవారేలోపే తరలించుకెళ్లారు.



❐ ఇక ఇసుక అక్రమ రవాణా గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే. కొండాపురం నుంచి మొదలు పెడితే పెన్నా తీరంలోని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కడప పరిసర ప్రాంతాల్లో తొలుకున్నోడికి తోలుకున్నంతా అన్నట్లుగా అక్రమ రవాణాకు పాల్పడ్డారు. పాపాఘ్ని నదిలో వేంపల్లె, కొత్తూరు, నందిమండలం, యర్రబల్లి, మాచునూరు, పైడికాల్వ, కమలాపురం వరకూ పాడవు చేతుల పందేరంగా మారింది. చెయ్యేరు నదిలోనూ అదే పరిస్థితి. ఇలా ఎక్కడికక్కడ ఇసుక అక్రమ రవాణాను జిల్లా వ్యాప్తంగా తెలుగుతమ్ముళ్లు కొనసాగిస్తూనే ఉన్నారు.

☛ ఇవన్నీ మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, టీడీపీ ముఖ్య అనుచరులు ప్రకృతి సంపద ఆధారంగా దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ భూములు స్వాహా చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులపై దౌర్జన్యకర ఘటనలకు పాల్పడుతున్నారు. పారిశ్రామికవేత్తకు ముప్పుతిప్పలు పెడుతున్నారు. నాలుగుదశాబ్దాల చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో అల్ట్రాటెక్ పరిశ్రమలో ఏకంగా వాటాలు అడిగారు. ఏడాది పొడవునా ఇలాంటి ఘటనలే తెరపైకి వస్తున్నా, కూటమి సర్కార్ 'సుపరిపాలనకు తొలి అడుగు'అంటూ గొప్పలకు పోతుంది. అదీ కూడా ఇంటింటికీ వెళ్లే ధైర్యం లేక, ఎంచుకున్న తెలుగుతమ్ముళ్ల ఇళ్లకు మాత్రమే పరిమితం అవుతుండడం గమనార్హం.

పాలనకు ఏడాది..
దోపిడీకి అడ్డుకట్టేది!

అభివృద్ధి పూర్తిగా అటకెక్కింది. సంక్షేమం ఊసే కరువైంది. ఇచ్చిన హామీ మూలనపడింది. అక్రమ ఆదాయానికి అంతే లేకుండా పోయింది. ఏడాది కూటమి పాలన 'మూడు కబ్జాలు.. ఆరు దౌర్జన్యాలు'గా సాగుతోంది. నేతల బెదిరింపులతో.. తమ్ముళ్ల స్వాహా పర్వాలతో అరాచకంగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా 'సుపరిపాలనకు తొలి అడుగం'టూ ప్రభుత్వ పెద్దలు గొప్పలు పోతుండడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది.

- అక్రమ మైనింగ్, ఇసుకతో యథేచ్ఛ దోపిడీ
- భూఅక్రమణలో పోటీపడుతున్న తెలుగుతమ్ముళ్లు
- పారిశ్రామికవేత్తలపై దౌర్జన్య పర్వం
- అక్రమ ఆదాయం కోసం పథకం ప్రకారం వేధింపులు



సాక్షి ప్రతినిధి, కడప: కూటమి ఏడాది పాలనలో జిల్లాలో అరాచకం రాజ్యమేలింది. అధికారంలోకి వచ్చింది మొదలు కూటమి నేతలు చెరువులను చెరబట్టారు. వాగుల్ని మింగేశారు. కాలువల్ని..పోరంబోకు భూముల్ని కొల్లగొడుతున్నారు. అధికారం అండ చూసుకుని తెలుగుతమ్ముళ్లు దర్జాగా కబ్జా చేస్తున్నారు. మైదుకూరు నియోజకవర్గంలోని నంద్యాలంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వేనంబర్ 859లో 16 ఎకరాలు, సర్వేనంబర్ 840లో 70 ఎకరాలు భూమికి ఏకంగా కంచె వేశారు. తిప్పిరెడ్డిపల్లె పరిధిలోని గోడేరు చెరువులో 50ఎకరాలు అన్యాక్రాంతమైంది. 30 ఎకరాలున్న వల్లూరమ్మ చెరువు 2 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. సర్వే నంబర్ 77లో 4ఎకరాలు కొండ పరంబోకును చదను చేశారు. 138/సీలో కుంట పరంబోకు 12 ఎకరాలు సబ్‌డివిజన్ చేయించుకొని పాసుబుక్‌లు కూడా తెచ్చుకున్నారు. సర్వే నంబర్ 742, 743లో గయ్యాళి భూమిలో చదును చేసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన సర్వే నంబర్ 231 కూడా అన్యాక్రాంతమైంది. ఇవన్నీ తెలుగుతమ్ముళ్ల స్వాహా చేసినవే.

ప్రతినెలా విద్యుత్ ఘాతం: ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) కింద ఇప్పటికే జిల్లా ప్రజలపై కూటమి ప్రభుత్వం కోట్లలో భారం మోపింది. చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు పేరుతో వినియోగదారులపై ప్రతినెలా అదనపు వడ్డనకు పాల్పడుతున్నారు. సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 91 పైసలు చొప్పున భారం వేస్తున్నారు. ఇలా ప్రతినెలా జిల్లాలో సుమారు రూ.10 కోట్లను వసూలు చేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

పారిశ్రామికవేత్తలకు ముప్పుతిప్పలు

కూటమి సర్కార్‌లో పారిశ్రామికవేత్తలకు ముప్పుతిప్పలు తప్పలేదు. అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమ అందుకు చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. 40ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ముడిఖనిజం సరఫరా చేసే టిప్పర్లు నిర్ణయిత పరిమితి కంటే 840 కిలోలు అదనంగా ముడి ఖనిజంతో వెళ్తున్నట్లు గుర్తించి, పోలీసులతో టిప్పర్లు సీజ్ చేయించారు. యాజమాన్యంతో నిమిత్తం లేకుండా ప్యాకింగ్ ప్లాంట్ నిలిపివేశారు. ప్యాకింగ్ ప్లాంట్ నిలిచిపోవడంతో సిమెంటు సరఫరా చేసే ట్రాన్స్‌పోర్టు లారీలు నిలిచిపోయాయి, సిమెంటు ఉత్పత్తి సైతం ఆగిపోయింది. మరోవైపు కార్మికులు పరిశ్రమలోపలికి విధులకు వెళ్లకుండా ప్రధాన ద్వారం వద్ద తిష్టవేసి అడ్డుకున్నారు. ఫైనల్‌గా పరిశ్రమలో వాటాలు ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వచ్చినట్లు సమాచారం. ఇలా అధికార పార్టీ నేతలు ఏడాది కాలంగా ఎవరిస్థాయిలో వారు అక్రమార్జన కోసం అనైతిక చర్యలకు పాల్పడుతున్నారు.

పథకాలు ఇవ్వకున్నా గొప్పలు: ఏడాదిగా అనేక సంక్షేమ పథకాలు మరుగున పడ్డాయి. నిరుద్యోగ భృతితో పాటు, ఆడబిడ్డ నిధి సంగతి ఊసే లేదు. అన్నదాత సుఖీభవ స్థానంలో దుఃఖీభవ కొనసాగుతోంది. రైతుల పట్ల కనీస స్పృహ లేకుండా కూటమి సర్కార్ పయనిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుపరిపాలనకు తొలి అడుగు అంటూ ప్రచారం చేసుకుంటుండడంపై ప్రజలు మండిపడుతున్నారు.

» నిరుద్యోగ భ్రాంతి



'ప్రతి ఇంటికి ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి తప్పకుండా ఇస్తాం'ఇవే మాటలు చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఊరు వాడ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి యువనేస్తం పథకం ద్వారా ప్రతి ఇంటికి నిరుద్యోగ భృతి కల్పిస్తామని తెలియజేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానంశంగా ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగం దక్కుతుందని, లేదంటే నిరుద్యోగ భృతి లభిస్తుందని యువత ఆశలు పెట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా 5.82లక్షల బీపీఎల్ కుటుంబాలున్నాయి. ఆయా కుటుంబాలల్లో ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులు. ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకున్నవారు 50,511 మంది ఉన్నారు. ఏటా యోగివేమన యూనివర్శిటీ పరిధిలో డిగ్రీ పట్టాలు తీసుకుంటున్నవారు 12వేల మందికి పైగా ఉన్నారు. ఇంటర్మీడియట్ పాస్ అయ్యే వారు సరాసరిగా 15వేలకు తగ్గడం లేదు. ఇంజనీరింగ్ పట్టా పొందేవారు దాదాపు 6వేల మంది జిల్లాలో ఉన్నారు. వీరు కాకుండా డిప్లొమో పూర్తి చేసేవారు లేకపోలేదు. సరాసరిగా 35వేల మందికి తక్కువ లేకుండా ఏటా యువకులు పట్టాలు పుచ్చుకొని ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్నారు. ఎటుచూసినా 1.5లక్షల మంది నిరుద్యోగ భృతికి అర్హులు జిల్లాలో ఉన్నారు. వారందరికీ భృతి భ్రాంతిగానే మిగిలింది.

కరుణ చూపని కూటమి

- అంత పెద్ద ప్రమాదం జరిగి కూలీలు చనిపోయినా ప్రకటించని పరిహారం
- రెక్కాడితే కానీ డొక్కాడని యానాదుల కుటుంబాలను ఆదుకోని ప్రభుత్వం



లారీ ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు (ఫైల్)

సాక్షి, రాయచోటి: రెడ్డిపల్లి చెరువుకట్టపై సోమవారం రాత్రి లారీ బోల్తా పడి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శెట్టిగుంట గిరిజన కాలనీకి చెందిన 9 మంది చనిపోగా.. చాలా మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. రెక్కాడితేగానీ డొక్కాడని కూలీలు మామిడి కాయల కోతకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారిని కూటమి ప్రభుత్వం ఆదుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వచ్చి పరామర్శతో సరిపుచ్చారే తప్ప ప్రభుత్వం తరపున ఆర్థికసాయం ప్రకటించలేదు. రైల్వేకోడూరు కూటమి నాయకులు రూపానందరెడ్డి అరకొరగా ఖర్చుల నిమిత్తం ఇచ్చారే తప్ప ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఎవరూ ప్రకటించలేదు.

ప్రాణాలు పోయినా పట్టించుకోరా..?

ఒకేసారి ప్రమాద ఘటనలో 9 మంది కూలీలు చనిపోగా మరో 10 మందికి పైగా గాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో సర్కార్ ప్రమాదం జరిగిన ఒకరోజో, రెండ్రోజుల్లోపు బాధిత కుటుంబాలను ఆదుకునే దిశగా అడుగులు వేస్తాయి. అయితే ఘటన జరిగినా మూడు రోజులు దాటినా ఇప్పటి వరకు కూటమి సర్కార్ నుంచి పరిహారపు మాటే లేదు. అడవిలో దొరికే పదార్థాలతో పాటు కూలి పనులకు వెళితే తప్ప జీవితం గడవని పేద కూలీలను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, రేణిగుంటకు చెందిన వారు పనుల కోసం వలస వచ్చి మృత్యువాతపడటం అందరినీ కలిచివేసింది. గాయపడిన వారు కూడా రాజంపేట ఆసుపత్రి నుంచి అలాగే గాయాలకు కట్లుతోనే సోమవారమే వెళ్లిపోయారు. ప్రభుత్వం అత్యుత్తమ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోకపోగా పరిహారపు మాట ఎత్తకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

▸▸ ఎదురుచూపులు

శెట్టిగుంట గిరిజన కాలనీ ఇంకా ప్రమాద సంఘటన నుంచి కోలుకోలేదు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ఎవరిని కదిపినా కన్నీటి పర్యంతం అవుతున్నారు. చనిపోయిన వారందరూ కాలనీలోని వారికి అంతా బంధువులే కావడంతో వారి బాధ వర్ణనాతీతం. ప్రభుత్వం నుంచి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. చనిపోయి న కుటుంబాలతో పాటు గాయపడ్డ వారికి కూటమి సర్కార్ వెంటనే ఆర్థికసాయం అందించాలని వైఎస్ ఆర్‌సీపీ డిమాండ్ చేస్తోంది.

గ్రామస్థాయికి జన్ సురక్ష పథకాలు



మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితిసింగ్

- జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు స్పెషల్ క్యాంపెయిన్
- ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్

కడప సెవెన్‌రోడ్స్: జన సురక్ష పథకాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఇన్చార్జి కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని బోర్డు రూమ్ కాన్ఫరెన్స్ హాల్లో జన్ సురక్ష పథకాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఈ నెల నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కు సంబంధించి సంబంధిత అధికారులతో తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్ సురక్ష పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లి నమోదు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి, వారిచే బ్యాంకు ఖాతాలను తెరిపించాలని ఆదేశించారు. జన్ ధన్ బ్యాంకు ఖాతాల ఈ కేవైసీ చేయనివారిని గుర్తించి ఈ కేవైసీ అప్డేషన్ ప్రక్రియను వేగంగా చేయాలన్నారు. డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు,లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజరు జనార్ధన్, నాబార్డ్ ఏజీఎం విజయ విహారి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పీ4

రాష్ట్రంలోని పేదరికాన్ని రూపు మాపడమే లక్ష్యంగా, "ప్రభుత్వం పీ4 విధానాన్ని రూపొందించిందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే బంగారు కుటుంబాలను ప్రాథమికంగా సర్వే ద్వారా గుర్తించామన్నారు. తుది జాబితాను తయారు చేసేందుకు గ్రామ వార్డు సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామసభల నిర్వహణకు 17వ తేదీ లోపు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసి ఈ నెల 18 నుండి ఆగస్టు 5వ తేదీ వరకు సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్డీవోలు , రాష్ట్ర సమగ్ర టీమ్ ప్రతినిధి సాయి సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

- బాలిక కుటుంబంలో తీరని విషాదం
- ఇలాంటి వాళ్లతో ఆడపిల్లలకు రక్షణ ఉండదు
- వీళ్లను ఎన్‌కౌంటర్ చేయాలి : బాలిక తండ్రి కొండయ్య ఆవేదన
- ముందు రోజు సాయంత్రం ప్రొద్దుటూరులో మిస్సింగ్ కేసు నమోదు

కాలేజీకి వెళ్తున్నానని చెప్పి..
శవమై వచ్చావా తల్లీ!

ప్రొద్దుటూరు క్రైం: 'అమ్మా కాలేజీకి వెళ్లాలి త్వరగా టిఫిన్ పెట్టు.. వస్తున్నా... ఇదిగో పట్టు నేనే తినిపిస్తా.. ఇక చాలమ్మా.. కాలేజీకి టైం అయింది. నేను వెళ్లాలి..'ఇది కూతురు.. ఆమె తల్లి మధ్య జరిగిన చివరి సంభాషణ. బ్యాగ్ తీసుకొని కుమార్తె కాలేజీకి బయలుదేరింది. వీధి చివర వరకు తల్లి అలానే చూస్తూ ఉండిపోయింది. అలా కళాశాలకని వెళ్లిన బాలిక కొన్ని గంటల్లోనే శవమై కనిపించింది.

• ఎర్రగుంట్ల మండలంలోని హనుమనగుత్తికి చెందిన పసుపులేటి కొండయ్య బేల్దారి పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆతనికి భార్య దస్తగిరమ్మతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మొదటి కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తుండగా కుమార్తె స్థానికంగా ఉన్న ప్రైవేట్ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. మరో కుమారుడు 7వ తరగతి చదువుతున్నాడు. వీళ్లకు ప్రొద్దుటూరులోని సార్వకట్ల వీధిలో సొంత ఇల్లు ఒకటి ఉంది. గ్రామం నుంచి కాలేజీకి వెళ్లిరావడానికి కూతురికి ఇబ్బందిగా ఉందని భావించి ఆర్నెళ్ల క్రితం ప్రొద్దుటూరుకు వచ్చారు.

కుమార్తె కాలేజీకి రాలేదని ఫోన్ రావడంతో..

సదరు బాలిక సోమవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి కళాశాలకు వెళ్లింది. ప్రతి రోజు ఆమెను సోదరుడు కాలేజీకి తీసుకెళ్లేవాడు. అతను ముందురోజే చెన్నైకి వెళ్లడంతో..బాలిక ఒంటరిగా కాలేజీకి వెళ్లింది. డ్వాక్రా సంఘానికి సంబంధించిన సమావేశం ఉండటంతో తల్లి దస్తగిరమ్మ కొద్దిసేపటి తర్వాత స్వగ్రామమైన హనుమనగుత్తికి వెళ్లిపోయింది. తండ్రి కొండయ్య కూడా బేల్దారి పని కోసం ఉదయాన్నే ఎర్రగుంట్లకు వెళ్లాడు. ఈ క్రమంలో వారి కుమార్తె కాలేజీకి రాలేదని సుమారు 9.30 గంటల సమయంలో కొండయ్యకు ఫోన్ వచ్చింది. ఇదే విషయాన్ని ఆయన తన భార్యకు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులందరూ వెంటనే కళాశాల వద్దకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడారు. అయితే హనుమనగుత్తికి చెందిన ఒక వ్యక్తిపై అనుమానం ఉండటంతో అతని గురించి ఆరా తీశారు. తమ సొంత బంధువుల ద్వారా అతని కదలికల గురించి తెలుసుకున్నారు.



బాలికను తీసుకెళ్లిన లోకేష్ (ఫైల్)

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు

తమ కుమార్తె కనిపించకపోవడానికి హనుమనగుత్తికి చెందిన లోకేష్ అనే వ్యక్తి కారణమై ఉండొచ్చని భావించిన కొండయ్య కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రాత్రికి రాత్రే లోకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. బాలికను గండికోటకు తీసుకెళ్లిన మాట నిజమేనని అతను పోలీసుల వద్ద అంగీకరించాడు.

రాత్రంతా గండికోటలో గాలింపు

పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు లోకేష్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సోమవారం రాత్రి పోలీసులు అతన్ని గండికోటకు తీసుకెళ్లారు. అక్కడి రెస్టారెంట్ రూములతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించారు. గ్రామస్తుల సహాయం తీసుకొని రాత్రంతా గాలించినా బాలిక ఆచూకి లభించలేదు. దీంతో పొద్దుపోయిన తర్వాత పోలీసులు గండికోట నుంచి వచ్చేశారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం బాలిక మృతదేహం గండికోటలోని ముళ్లపొదల్లో ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తమ కుమార్తె శవమై పడి ఉందని తెలియడంతో కుటుంబ సభ్యులు విలపించసాగారు. బంధువులు, సన్నిహితులు పెద్ద ఎత్తున వారి ఇంటి వద్దకు వచ్చి ఓదారుస్తున్నారు.

ఇలాంటి వాళ్లను ఎన్‌కౌంటర్ చేయాలి

'ఇలాంటి వాళ్లతో ఆడపిల్లలకు రక్షణ ఉండదు. వీళ్లు ప్రపంచంలో ఎక్కడున్నా ఎన్‌కౌంటర్ చేసి పడెయ్యాలి.. జైళ్లలో పెట్టి ఏళ్ల తరబడి ఈ మృగాలను మేపడం వృథా.. వెంటనే మరణ దండన విధించాలి.. మీ చేత కాకుంటే చెప్పండి నేనే చంపేస్తా'అంటూ బాలిక తండ్రి కొండయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

కడప కార్పొరేషన్: కడప జిల్లా గండికోటలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని హత్యకు గురి కావడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. మహిళలు, బాలికలపై హత్యలకు, హత్యాచారాలకు పాల్పడితే సహించేది లేదని, ఉక్కుపాదంతో అణచివేస్తామని స్పష్టంచేశారు.

క్లుప్తంగా

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి


సువార్తమ్మ మృతదేహం

జమ్మలమడుగు : ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎర్రగుంట్ల మండలం కల్లమల్ల గ్రామంలోని కృష్ణానగర్‌కు చెందిన సువార్తమ్మ(35) డ్వాక్రా సంఘానికి డబ్బులు కట్టాలని, డబ్బులు ఇవ్వాలంటూ కుమారుడిని కోరింది. దీంతో తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో డ్వాక్రా సంఘానికి డబ్బులు కట్టలేక.. ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకునే ప్రయత్నం చేసింది. అయితే చుట్టుపక్కల వారు గుర్తించి వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ మరణించిందని కల్లమల్ల పోలీసులు పేర్కొన్నారు.

కందుల నాని అలియాస్ ఓబుల్‌రెడ్డి దౌర్జన్యం

– కందుల రాజమోహన్‌రెడ్డి తనయుడు కందుల మురళీమోహన్‌రెడ్డిపై దాడి


గాయపడిన కందుల మురళీమోహన్‌రెడ్డి

కడప అర్బన్ : కందుల రాజమోహన్ రెడ్డి తనయుడు బీజేపీ నేత కందుల మురళి మోహన్ రెడ్డి (42)పై కేఎస్ ఆర్ఎం గ్రూప్ అఫ్ కాలేజెస్ చైర్మన్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి అలియాస్ నాని తన అనుచరులతో కలిసి మంగళవారం ఉదయం విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ సంఘటనలో బీజేపీ నేత కందు మురళీమోహన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ముక్కు, ఎడమ కంటికి గాయాలయ్యాయి. ఇంకా శరీరమంతా దెబ్బలు తగిలాయి. గాయపడిన కందుల మురళీమోహన్ రెడ్డిని వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో బాధితుడు మురళీమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కడప నగరం రాజారెడ్డి వీధిలోని కందుల రెసిడెన్సీలో 105 ఫ్లాట్‌లో తాను వుంటున్నానని, అదే అపార్ట్‌మెంట్‌లో 6వ అంతస్తులో కందుల చంద్ర ఓబుళరెడ్డి అలియాస్ నాని నివాసం వుంటున్నాడన్నారు. అదే ఇంటిలో తన పెద్దమ్మ వుంటున్నారని మంగళవారం ఉదయం వాళ్లింటికి తాను కాఫీ తాగేందుకు, టిఫిన్ తినడానికి వెళ్లి మంచిచెడ్డలు పలుకరింపుగా వెళ్లానన్నారు. అదే సమయంలో ఆస్తి పంపకాల గురించి మాట్లాడుతున్న సమయంలో.. కందుల చంద్ర ఓబుళరెడ్డి అలియాస్ నాని తన అనుచరులతో కలిసి తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ సంఘటనపై అతనిపై, బాధ్యులైన అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ సీఐ బి.రామకృష్ణ తెలియజేశారు. తీవ్రంగా గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మురళీమోహన్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, ఇతర బీజేపీ నాయకులు, బంధువులు, స్నేహితులు వచ్చి పరామర్శించారు.

సొమ్మొకరిది.. సోకొకరిదన్నట్లు ఎమ్మెల్యే వ్యవహారం

- 13 నెలల్లో నగరపాలక సంస్థకు నయాపైసా నిధులు తేలేదు
- మేం ప్రతిపాదించి, ఆమోదించిన పనులకు శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటు
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన మేయర్ సురేష్‌బాబు
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12.70 కోట్ల పనులకు శంకుస్థాపన


5వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : 'సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి వ్యవహారం ఉంది' అని మేయర్ సురేష్ బాబు విమర్శించారు. మంగళవారం 5,9,10, 11,12,13, 14, 20, 21,23, 24 డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12.70 కోట్లతో చేపడుతున్న పనులను ఆయన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి టెంకాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2014–19 వరకూ టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉందని అప్పుడు కూడా జిల్లా అభివృద్ధికి గానీ, కడప నగరాభివృద్ధికి గానీ ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలవున్నా నగరపాలక సంస్థకు నయాపైసా నిధులు ఇవ్వలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం కింద నిధులు మంజూరైతే డివిజన్లలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ప్రతిపాదించగా, తాము సర్వసభ్య సమావేశంలో ఆమోదించామన్నారు. డిసెంబర్ 23న జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవి నానా రచ్చ చేసి 15వ ఆర్థిక సంఘ పనులు ప్రతిపాదించిన అజెండా పేపర్లను చించి వేశారని, ఇప్పుడేమో ఆ పనుల ప్రారంభోత్సవాలకు పాలవర్గ సభ్యులను గానీ, మేయర్‌గా తనను గానీ పిలవకుండా ఏకపక్షంగా ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ జిల్లా, కడప నగరం అభివృద్ధి చెందిందంటే అది వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల వల్లేనన్నారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరాభివృద్ధికి రూ.2400 కోట్లు విడుదల చేశారన్నారు. నగరంలో ఏడు రహదారులను విస్తరించి సుందరీకరణ చేశామని, రూ.57 కోట్లతో బుగ్గవంక వాల్‌ను పూర్తి చేసి, 40 అడుగులతో అప్రోచ్ రోడ్లు మంజూరు చేశామన్నారు. రూ.78 కోట్లతో వరద నీటి కాలువల నిర్మాణం చేపట్టామన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎమ్మెల్యే మాధవి బంధువు కావడం వల్ల .. అంతా ఆమె చెప్పినట్లు జరుగుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కడప నగరానికి రూ.10 కూడా మంజూరు చేయలేదని, ప్రభుత్వం ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులను జీవోలు, తేదీలు మార్చి తమ ఘనతగా చెప్పుకోవడం దారుణమన్నారు. బుగ్గవంకపై నాగరాజుపేట, షామీరియా మసీదుల వద్ద బ్రిడ్జిలకు గత ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేస్తే.. గెలిచిన వెంటనే ఆ బ్రిడ్జిల వద్దకు పోయి ఏడాది లోపు పనులను పూర్తి చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఇంతవరకూ చేయలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైతే ఆ టెండర్లలో ఎవరూ పాల్గొనవద్దని ఎమ్మెల్యే బెదిరించారని, ఆ టెండర్లన్నీ నలుగురికే కట్టబెట్టారన్నారు. కార్పొరేషన్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు మేయర్‌ను, కార్పొరేటర్లను పిలవకుండా.. వార్డు మెంబర్‌గా గెలవలేని వారితో టెంకాయలు కొట్టించడం అన్యాయమన్నారు. శిలాఫలకాల కోసం, అందులో తన పేరు కోసం ఎమ్మెల్యే పాకులాడుతున్నారే తప్ప, ప్రజా సమస్యలపై కాదన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు శివకోటిరెడ్డి, మల్లికార్జున, గంగాదేవి, వై.మాధవి, కె.బాబు, మేసా ప్రమీలరాణి, రామలక్ష్మణ్‌రెడ్డి, షఫీ, డివిజన్ ఇన్‌చార్జులు బండి ప్రసాద్, మేసా ప్రసాద్, ఐస్‌క్రీం రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, బీహెచ్ ఇలియాస్, శ్రీరంజన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, యానాదయ్య, గుంటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హుసేని పీర్ దర్గా ఉరుసు


దర్గాలోని స్వామి సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న స్వామి వారసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గా వీధిలో వెలసిన హుసేనిపీర్ దర్గా 200వ ఉరుసు మహోత్సవాలు మంగళవారం నిర్వహించిన తహలిల్ ఫాతిహతో ముగిసాయి. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి వారసులు స్వామి సమాధికి పూలచాదర్ సమర్పించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారసులతోపాటు శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా ఆవరణలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి నాల్గవ, ఐదవ తరం వారసులు మున్వర్‌బాష, సలీం, దర్గారహమతుల్లా, దర్గాషఫివుల్లా, దర్గాకరీముల్లా, ఆర్గనైజర్లు షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏసీఏ పోటీల్లో చిత్తూరు జట్టు విజయం


జయప్రకాశ్, చిత్తూరు (3 వికెట్లు)


దినేష్, చిత్తూరు (3 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లో మూడవ రోజైన మంగళవారం కడప జట్టుపై చిత్తూరు జట్టు 5 పరుగులతో విజయం సాధించింది. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 193 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 85 ఓవర్లకు 239 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని క్యాశప్‌రెడ్డి 37 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని జయప్రకాశ్ 3, దినేష్ 3, తేజేష్ 2 వికెట్లు తీశారు. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 239 పరుగులు మాత్రమే చేసింది. చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

నాడు అలా.. నేడు ఇలా!

- తీర్మానాలు అడ్డుకుని ప్రతులను చింపేసిన ఎమ్మెల్యే మాధవీ
- ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించిన నగర పాలకమండలి
- 15వ ఫైనాన్స్ నిధులు రూ.12.7 కోట్లకు ప్రతిపాదనలు
- నాడు అజెండా కాపీలను చింపేసి హంగామా చేసిన ఎమ్మెల్యే
- నేడు అవే పనులకు నిస్సిగ్గుగా శంకుస్థాపనలు

సాక్షి ప్రతినిధి, కడప : ప్రజాప్రతినిధులు అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ఉండాలి. అధికారంలో ఉంటే ప్రాంతం కోసం ప్రభుత్వాన్ని మెప్పించి, ఒప్పించి ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చేందుకు విశేష కృషి చేయాలి. కడప గడపలో తద్భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా అభివృద్ధి కోసం నిధులు తీసుకురాకపోగా, నగర పాలకమండలి అభివృద్ధి పనుల కోసం ప్రయత్నిస్తే నాడు ఎమ్మెల్యే మాధవీరెడ్డి అడ్డుతగిలారు. నేడు పాలకమండలి తీర్మానం మేరకు చేపట్టే అవే పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటున్న విచిత్ర పరిస్థితి ఇది.

2024 డిసెంబర్ 23న నగర పాలకమండలి సర్వసభ్యసమావేశం చేపట్టారు. ఆ సమావేశంలో వేదికపైన కుర్చీ వేయలేదని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి రెచ్చిపోయి ప్రవర్తించారు. సమావేశం నిర్వహించకుండా అధికారం అండతో అడ్డుతగిలారు. అజెండా ప్రతులను చింపేశారు. అయినప్పటికీ నగరంలో ఉన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని మేయర్ సురేష్‌బాబు పలు తీర్మానాలను ప్రవేశ పెట్టారు. ఆ మేరకు డిసెంబర్ 23న కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అందులో 15వ ఫైనాన్స్ నిధులు రూ.12.7 కోట్ల ద్వారా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూడా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయా డివిజన్లలో సమస్యలను గుర్తించింది కార్పొరేటర్లు, పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపింది కూడా కార్పొరేటర్లే. కాగా, నాడు సమావేశం నిర్వహించకుండా.. అడ్డుతగిలిన ఎమ్మెల్యే, ఏకంగా అజెండా ప్రతులను కూడా చింపేశారు. అయినప్పటికీ మేయర్ సురేష్‌బాబు, కార్పొరేటర్లు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆమేరకు ఆయా డివిజన్లలో చేపట్టుతున్న అభివృద్ధి పనులకు నేడు ఎమ్మెల్యే నిస్సిగ్గుగా శంకుస్థాపనలు చేస్తున్నారని పలువురు కార్పొరేటర్లు దెప్పి పొడుస్తున్నారు. కడప అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తీసుకవచ్చి శంకుస్థాపనలు చేస్తే ప్రజలు హర్షిస్తారని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వైవీయూలో బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు


మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో 2025– 26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం వైవీయూలోని ప్రిన్సిపల్ చాంబర్‌లో పలువురు డీన్లతో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)– 2020ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంలో భాగంగా బీఎస్సీ(హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్, ఎర్త్ సైన్స్ కోర్సులలో త్వరలో ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. బీఎస్సీ(ఆనర్స్) ఫిజిక్స్ సబ్జెక్టుతోపాటు కంప్యూటర్ సైన్స్, నానో–సైన్స్, కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్, టెక్నాలజీలను విద్యార్థులు ఎంపిక చేసుకొని చదివే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ (ఆనర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతోపాటు అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ చదవచ్చన్నారు. బీకాం (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్ ప్రధాన అంశంగా కలిగి ఉందన్నారు. ఈ సమావేశంలో పూర్వ ప్రధానాచార్యులు, ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, డీన్ ఫర్ అకడమిక్ అఫైర్స్ చంద్ర ఓబులరెడ్డి, డీవోయే డైరెక్టర్ టి లక్ష్మి ప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ విమర్శించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శులు క్రిష్ణవేణి, మూలే సరస్వతితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కృష్ణా జిల్లాలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన నాయకులు రాళ్లు, కట్టెలు, బండరాళ్లతో దాడులు చేయడం హేయమన్నారు. అక్కడ పోలీసులు ఉండి కూడా ప్రేక్షక పాత్ర వహించడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో ఓ వైద్యుడు 32 మంది విద్యార్థినుల వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోదన్నారు. రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి గానీ, డిప్యూటీ సీఎం గానీ, హోంమంత్రి గానీ స్పందించిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కళ్లు తెరవాలని, మహిళలపై దాడులు జరక్కుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గవర్నర్ జోక్యం చేసుకొని ఈ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, మహిళా నేతలు పత్తి రాజేశ్వరి, ఉమామహేశ్వరి, బి.మరియలు, సునీలమ్మ, తులశమ్మ, నారాయణమ్మ, మల్లీశ్వరి, సుజిత, పద్మ, శివమ్మ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు బ్రోకర్‌గా పని చేస్తున్నావా?

- వీఆర్‌ఓపై టీడీపీ ఎమ్మెల్యే మాధవి దుర్భాషలు
- తాను అలా అనలేదని వీఆర్‌ఓ చెబుతున్నా.. నోర్మూసుకో అంటూ గదమాయింపు


వీఆర్‌ఓ మహేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే మాధవి

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ విప్, కడప టీడీపీ ఎమ్మెల్యే మాధవి మరోసారి రెచ్చిపోయారు. సచివాలయ ఉద్యోగి అయిన వీఆర్‌ఓపై నోరుపారేసుకున్నారు. పది మంది చూస్తుండగానే 'నీవు కార్పొరేటర్‌కు బ్రోకర్‌గా పని చేస్తున్నావా' అని వీఆర్‌వోపై మండిపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం 'సుపరిపాలనలో తొలి అడుగు– ఇంటింటికీ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని 30వ డివిజన్‌లో ప్రభుత్వ విప్ మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ ఇటీవల తన రేషన్ కార్డులో ఉన్న అమ్మానాన్నలను తొలగించి.. తమ భర్త, పిల్లలతో రేషన్ కార్డు చేయించాలని వీఆర్‌ఓ మహేందర్‌ను ఆశ్రయించింది. ఆయన డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని కలవాలని సూచించారు. కాగా సదరు సెక్రటరీ ఆ ఫ్యామిలీకి హెడ్ అయిన భర్త వేలి ముద్రలు కావాలని చెప్పడంతో.. ఆమె మళ్లీ వీఆర్‌ఓ వద్దకు వచ్చి చెప్పింది. ఈ విషయం 30వ డివిజన్‌లో పర్యటిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే మాధవికి తెలియడంతో ఆమె చిర్రెత్తిపోయారు. 'రేషన్ కార్డులో ఏం సమస్య ఉందో చెప్పి పరిష్కరించడమే నీ పని.. నీలాంటి బ్రోకర్లను పెట్టుకొని నడుపుతున్నారు. కార్పొరేటర్ పేరు రాసి ఆయన్ను కలువు.. పో అంటావా.. ప్రభుత్వం దగ్గర జీతం తీసుకుంటూ కార్పొరేటర్‌కు బ్రోకర్‌గా పని చేస్తున్నావా? నగర ప్రజలు కార్పొరేటర్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాలా.. వాళ్లింటి దగ్గర కూర్చొని వారు రేషన్ కార్డులిస్తే తీసుకోవాలి' అంటూ ఆవేశంతో ఊగిపోయారు. దీంతో నివ్వెరపోయిన వీఆర్‌ఓ తాను అలా అనలేదని చెబుతున్నా వినకుండా నోర్మూయ్ అంటూ ఎమ్మెల్యే మాధవి గదమాయించారు. సాక్షాత్తు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర సమక్షంలో పది మంది ముందూ ఇలా ప్రభుత్వ ఉద్యోగిని బ్రోకర్ అంటూ పరుష పదజాలం ఉపయోగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉద్యోగ సంఘాలు ఏ విధంగా స్పందిస్తాయో వేచిచూడాలి.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

1.5 కేజీల వెండి, బంగారు స్వాధీనం


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పలు దొంగతనాలు చేసిన నల్గొండ జిల్లా భువనగిరికి చెందిన అంతర్ రాష్ట్ర దొంగ గజ్జల శ్రీనివాస్ (47)ను అరెస్టు చేయడంతోపాటు మరో బాల నేరస్తున్ని అదుపులోకి తీసుకున్నట్లు కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను తెలియజేశారు. గజ్జల శ్రీనివాస్‌పై ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 15 కేసులు ఉన్నాయన్నారు. చలమారెడ్డిపల్లి ఎమ్మెస్సార్ హిల్స్‌లోని ఒక ఇంటిలో, కడప పాత బైపాస్ రోడ్డులోని వెంకట సాయినగర్‌లోని 2 ఇళ్లలో, సాయి నగర్‌లో ఒక ఇంటిలో చోరీ చేశాడన్నారు. కొన్ని రోజులుగా జరిగిన దొంగతనాలకు సంబంధించిన చోరీ సొమ్మును అతని వద్ద నుంచి పూర్తిగా రికవరీ చేసినట్లు తెలిపారు. రికవరీ చేసిన వాటిలో ఒక జత బంగారు బుట్ట కమ్మలు, ఒక బంగారు ఉంగరం, ఒక కేజీ 500 గ్రాముల వెండి వస్తువులు, మోటార్ సైకిల్, ఆరు చేతి గడియారాలు, రెండు కెమెరాలు ఉన్నాయని తెలిపారు. చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవుని కడప ఆర్చి వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి ఇంకొక బాలనేరస్తుడిని అదుపులోకి తీసుకొని ఈ వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కడప చిన్నచౌక్ ఇన్‌స్పెక్టర్ జి.ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సీసీఎస్ సిబ్బందిని, ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ చంద్రమోహన్, సుదర్శన్‌రెడ్డి, ఏఎస్ఐ సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, శివకుమార్, కానిస్టేబుల్ ఖాదర్ హుస్సేన్, శ్రీనివాసులు, మాధవరెడ్డి, సుధాకర్ యాదవ్ నాగరాజులను కడప డీఎస్పీ అభినందించి రివార్డుల కోసం సిఫార్సు చేసినట్లు వివరించారు. ఈ కేసు ఛేదించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

వివాదాస్పద ఫ్లెక్సీ కేసులో ఇద్దరు అరెస్టు

కడప అర్బన్ : కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కేసులో డాక్టర్‌తోపాటు ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమానిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 12వ తేదీ రాత్రి దాదాపు 7 గంటల సమయంలో కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ వద్ద 'ఎంత పని సేచ్చివయ్య జగనూ' అని హెడ్డింగ్ పెట్టి 12 పాయింట్స్ కలిగిన ఒక బ్యానర్‌ను చెన్నై చిల్డ్రెన్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ నారపురెడ్డి నాగార్జునరెడ్డి, గ్లేస్ ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమాని అమృతరాజు ఏర్పాటు చేశారన్నారు. ఈ బ్యానర్‌ను పరిశీలించగా అందులో రెండు రాజకీయ పార్టీల మధ్య చిచ్చు పెట్టి, ఘర్షణ వాతావరణం సృష్టించి ప్రజా శాంతికి, లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగించే విధంగా ఉండటంతో.. ఆ ఫ్లెక్సీ ఏర్పాటు విషయమై వచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు క్రైం నంబరు 148/2025, యు/ఎస్ 61(2) 325 ఆర్–డబ్ల్యు 3(5) బి.ఎన్.ఎస్ కింద వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసుకు సంబంధించి వారిని మంగళవారం మధ్యాహ్నం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎవరైనా కానీ తమకు గల వాక్ స్వాతంత్రపు హక్కును దుర్వినియోగం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద అంశాలు కలిగిన బ్యానర్‌లను తయారు చేయకూడదని ఫ్లెక్సీ ప్రింటింగ్ తయారీ యజమానులకు డీఎస్పీ సూచించారు. వివాదాస్పద అంశాలు కలిగిన బ్యానర్‌లు తయారు చేయాలని మీ వద్దకు ఏదైనా సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. బ్యానర్ కింద ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నంబరును తప్పకుండా ముద్రించాలన్నారు.

బదిలీ అయినా.. వెళ్లని ఖాకీలు

- ఇటీవల కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్స్, ఏఎస్ఐల బదిలీ
- జిల్లా వ్యాప్తంగా ఎస్పీ ఉత్తర్వులు
- కొన్ని చోట్ల రిలీవ్ కాని సిబ్బంది

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఈ నెల 9వ తేదీన జిల్లా ఎస్పీ ఇ.జి.అశోక్ కుమార్ జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను బదిలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్లలో రిపోర్టు చేసుకోవాలని బదిలీల ఆర్డర్‌లో ఎస్పీ పేర్కొనడం జరిగింది. సాధారణంగా బదిలీ ఆర్డర్ వచ్చిన వెంటనే పోలీసు సిబ్బంది ఒకట్రెండు రోజుల్లోపు ప్రస్తుతం పని చేసే పోలీస్‌స్టేషన్ నుంచి రిలీవ్ ఆర్డర్‌ను తీసుకుని.. తమకు బదిలీ అయిన పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేసుకుని అక్కడ జాయిన్ కావాల్సి ఉంటుంది.

కొన్నిచోట్ల రిలీవ్ కాని సిబ్బంది :

అయితే జిల్లాలో కొన్ని చోట్ల పని చేస్తున్న పోలీసు సిబ్బంది ఈ నెల 9వ తేదీన ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు తాము పని చేస్తున్న పాత పోలీస్‌స్టేషన్ల నుంచి రిలీవ్ కాలేదు. ఏదైనా ప్రత్యేక పరిస్థితులు, ఇతర కారణాలు ఉన్నప్పుడు మాత్రమే బదిలీ అయినా కూడా రిలీవ్ కాకుండా ఉండే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం బదిలీ అయిన సిబ్బందిలో చాలా మటుకు పోలీసు సిబ్బంది పాత పోలీస్‌స్టేషన్ల నుంచి రిలీవ్ కాకుండా అక్కడే అంటి పెట్టుకుని ఉన్నారు.

అధికారులతో సత్సంబంధాలే కారణమా..?

బదిలీ అయిన వారిలో చాలా మంది పోలీసు సిబ్బంది రిలీవ్ కాకపోవడానికి తాము పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్లలో అధికారులతో సత్సంబంధాలే కారణమన్నట్లు తెలుస్తోంది. తాము పని చేస్తున్న పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐలు, సీఐలతో వీరు అనుకూలంగా ఉంటూ వారికి అనునయులుగా వ్యవహరిస్తూ వ్యవహారాలు చక్కబెడుతున్నట్లు సమాచారం. అంతేకాక వీరు అధికారులకు, అధికార పార్టీ నాయకులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ వారు కోరినట్లుగా పనులు చక్కపెడుతున్నారు. అలాంటి వారిని రిలీవ్ చేయడానికి అధికారులు తటాపటాయిస్తున్నట్లు సమాచారం. సాక్షాత్తూ జిల్లా పోలీసు ఉన్నతాధికారి బదిలీ ఉత్తర్వులు అమలు అవుతాయో, లేదో వేచి చూడాల్సి ఉంది.